శుభ్రత కాదు.. రోత



కంచరపాలెం ఎఫ్‌సీఐ గిడ్డంగి వద్ద నివాసాల మధ్యలో నిలిపిన సెప్టిక్ క్లీన్ ట్యాంకర్

- జోన్-5లో జనావాసాల మధ్య సెప్టిక్ క్లీన్ ట్యాంకర్ల తిష్ట
- బహిరంగ ప్రదేశాల్లో విడిచిపెడుతున్న సెప్టిక్ వ్యర్థాలు
- ట్యాంకర్ల పార్కింగ్, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- చోద్యం చూస్తున్న పబ్లిక్ హెల్త్ అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 పరిధిలోని పలు ప్రాంతాల్లో జనావాసాల మధ్య సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు తిష్ట వేశాయి. ఇళ్ల నుంచి తొలగించిన సెప్టిక్ వ్యర్థాలను దూర ప్రదేశాలకు తీసుకెళ్లి విడిచిపెట్టకుండా అక్కడి కాలువల్లో వదిలి పెడుతున్నారు. కాలనీల పరిసరాలు దుర్గంధభరితంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల మధ్య డ్రెయిన్లలో సెప్టిక్ వ్యర్థాల డంపింగ్‌తో రోగాల బారిన పడతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పట్టించుకోకుండా జోన్-5 పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులు, సిబ్బంది చోద్యం చూస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.


బీఆర్‌టీఎస్ రహదారిలోని ఎయిడెడ్ విద్యా సంస్థలకు ఆనుకుని నిత్యం పార్క్ చేస్తున్న సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు

ఎక్కడి నుంచే తెచ్చి ఇక్కడ డంపింగ్..

కంచరపాలెం భారత ఆహార గిడ్డంగి సంస్థ, జీఎన్ఎస్ యూఆర్ఎం కాలనీ, తిక్కవానిపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా, మర్రిపాలెం తదితర ప్రాంతాల్లో సెప్టిక్ క్లీన్ ట్యాంకర్లతో పలు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకర్లలో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన సెప్టిక్ వ్యర్థాలను ఎర్రిగెడ్డ, రైల్వే స్టేషన్, కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన మీద, సాంబమూర్తి నగర్ పోర్ట్ క్వార్టర్స్, ఎఫ్‌సీఐ గిడ్డంగి, డీజిల్ లోకోషెడ్, వాషింగ్‌లైన్‌కు వెళ్లే ప్రాంతాల్లో రాత్రి వేళల్లో విడిచి పెడుతున్నారని, పరిసరాలు దుర్వాసనతో నిండిపోతున్నాయని వాపోతున్నారు.


104 ఏరియా జ్యోతినగర్‌లోని కాలువలోకి సెప్టిక్ వ్యర్థాలను వదులుతున్న దృశ్యం

వ్యర్థాలను విడిచి పెట్టిన తరువాత నివాసాల మధ్యే రోజుల తరబడి సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలను నిలిపి ఉంచడంతో అటుగా ప్రయాణించే పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పార్కింగ్‌కు అనుకూలంగా ఇక్కడి ప్రదేశాలు ఉండటంతో నగరంలోని సెప్టిక్ క్లీన్ ట్యాంకర్లను నిత్యం ఇక్కడే నిలుపుతున్నారు. సాయంత్రం వేళ చీకటి పడే సమయానికి జన సంచార ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌పై గల డక్‌లు, కాలువల్లో సెప్టిక్ వ్యర్థాలను విడుస్తున్నారు. ఇదేం పనని గట్టిగా అడిగితే ట్యాంకర్ల యజమానులు ఎదురుతిరుగుతున్నారని ద్విచక్ర వాహనదారులు, స్థానికులు చెబుతున్నారు.

ఇళ్లకు స్టిక్కర్లు.. గోడలపై రాతలు

కంచరపాలెం, జ్ఞానాపురం, మర్రిపాలెం, ఎన్ఏడీ వరకు గల పరిసర ప్రాంతాల్లో సుమారు 25-35 సెప్టిక్ క్లీన్ ట్యాంకర్లతో వ్యాపారాలు చేస్తున్నారు. తమ వ్యాపారాల పబ్లిసిటీ కోసం ఆయా ప్రాంతాల్లోని ఇళ్లకు స్టిక్కర్లు, విద్యుత్ స్తంభాలకు సున్నాలు వేసి ఫోన్ నంబర్లు రాయడం వంటివి చేస్తున్నారు. ఇళ్లకు అంటించిన స్టిక్కర్లు, గోడలకు వేసి రంగులు ఊడిపోయి అంధవికారంగా కనిపిస్తున్నాయని, విద్యుత్ స్తంభాలపై వేసిన ఫోన్ నంబర్లతో పోల్ నంబర్లు కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. జీవీఎంసీ జోన్-5 అధికారులు దృష్టి సారించి సెప్టిక్ క్లీన్ ట్యాంకర్ల నుంచి ఇష్టారాజ్యంగా వ్యర్థాలను విడిచి పెడుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

పరిసరాలు దుర్గంధభరితం

నివాస ప్రాంతాల్లో నిత్యం సెప్టిక్ క్లీన్ ట్యాంకర్లను ఉంచడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. ముక్కు మూసుకుని అటుగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. జనావాసాలకు దూరంగా సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలు పార్క్‌చేసేలా, వ్యర్థాలు డంప్‌చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– కె.రాజ్యలక్ష్మి, కంచరపాలెం

అడిగే వారు లేకపోవడంతో..

సెప్టిక్ క్లీన్ ట్యాంకర్‌లో నింపిన వ్యర్థాలను నగరానికి దూరంగా తీసుకెళ్లి విడుదల చేయాలి. వ్యాపారాల లబ్ధి కోసం ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాల్లో విడుస్తున్నారు. అడిగితే గొడవలు అడుతున్నారు. అడిగే వారు లేకపోవడం, పబ్లిక్ హెల్త్ అధికారులు పర్యవేక్షించక పోవడంతో సెప్టిక్ క్లీన్ ట్యాంకర్ల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

– ఆర్.సుధీర్‌కుమార్, తిక్కవానిపాలెం

అధికారులు స్పందించాలి

సెప్టిక్ క్లీన్ ట్యాంకర్ల యాజమానులు చేస్తున్న తప్పిదాలపై అధికారులు స్పందించాలి. నగరాభివృద్ధికి పచ్చదనం కావాలని ర్యాలీలు చేస్తూ.. మొక్కలు నాటుతున్నారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలతో మా ప్రాంతాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. సంబంధిత అధికారుల పర్యవేక్షించి సమస్య పరిష్కరించాలి.

– ఎస్.జీవన్‌బాబు, ఊర్వశి జంక్షన్

క్లుప్తంగా

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం నేడు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ సర్వసభ్య సమావేశం శనివారం సాయంత్రం వాకర్స్ పార్కులో నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సీహెచ్ఎస్‌ఎస్‌వీ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్‌తోపాటు వాకర్స్ డిస్ట్రిక్ట్-101 గవర్నర్ కె.ద్వారకానాథ్ పాల్గొంటారని చెప్పారు. వాకర్స్ వాయిస్ ఆవిష్కరణతోపాటు, నూతన సభ్యుల ప్రమాణ స్వీకారం, భవిష్యత్ ప్రణాళికపై చర్చిస్తామన్నారు. క్లబ్ సభ్యులందరూ హాజరు కావాలని వారు కోరారు.

ఘనంగా గ్యార్వీ షరీఫ్ వేడుకలు


ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు జాకీర్ హుస్సేన్ నగర్ మస్జీద్ ఈ అల్ ఖదీర్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్యార్వీ షరీఫ్ చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. మసీదు ప్రాంగణంలో స్థానిక ముస్లింలు ఖురాన్ పఠించారు. వేడుకల్లో భాగంగా మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో చిన్నారులు, ముస్లిం మత గురువులు నాతే కలాంలు ఆలపిస్తూ శాంతి ర్యాలీ చేశారు. అనంతరం కాలనీలోని హజ్రత్ గౌస్ నిషానీ షరీఫ్ వద్ద ఫాతిహా నిర్వహించి బావుటా(పవిత్ర వస్త్రం) సమర్పించారు. కార్యక్రమాన్ని మసీదు కమిటీ అధ్యక్షుడు మున్నా, ఉర్స్ కమిటీ సభ్యులు లతీఫ్ తదితరులు పర్యవేక్షించారు.

నవంబర్ 5న జర్నలిస్టుల ఫెడరేషన్ సేవా కార్యక్రమాలు

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నవంబర్ 5న పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.నారాయణ తెలిపారు. అక్కయ్యపాలెంలోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నవంబర్ 5న రోటరీ సహకారంతో రక్తదాన శిబిరం తోపాటు మరికొన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. తెలుగు రాష్ట్రాల్లో సేవా కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. జర్నలిస్టుల పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఆయా ప్రాంతాల వారీగా మంత్రులకు మరోసారి వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించండి


నిరసన తెలుపుతున్న యూజీడీ కార్మికులు

బీచ్‌రోడ్డు: తమ సమస్యలు పరిష్కరించాలని యూజీడీ కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు టి.నూకరాజు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఇ.ఆదినారాయణ మాట్లాడుతూ జీవో 36 ప్రకారం కార్మికులందరికీ ఒకేలా జీతాలు చెల్లించాలన్నారు. అలాగే 315 మంది కార్మికులకు అరియర్స్ చెల్లించాలన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు సేఫ్టీ పరికరాలు ఇవ్వకపోవడం సరైనది కాదన్నారు. కార్మికుల పేరిట పీఎఫ్, ఈఎస్ఐ జమ చేయించి న్యాయం చేయాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే మరో సమ్మెకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో సతీష్, సింహాచలం, నరేష్, అంజి, సన్నిబాబు, రాంబాబు, సాయి, సత్యం, సీతంనాయుడు, మహేష్, లక్ష్మి, వెంకటేష్, అప్పలరాజు, గణపతి తదితరులు పాల్గొన్నారు

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం


వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రత్నకుమార్, వైద్యులు

మురళీనగర్: ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యంపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మానసిక ఆరోగ్యంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని వక్తలు పేర్కొన్నారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ హారిక, నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల విభాగం డాక్టర్ మోహన్, ఏరియా ఆస్పత్రి సైకియాట్రిస్ట్ డాక్టర్ నిత్య ఐశ్వర్య పాల్గొని విద్యార్థులు మానసిక పరమైన ఒత్తిళ్లను తట్టుకునే విధానాలను వివరించారు. అనంతరం వారోత్సవాల పోస్టర్‌ను ప్రిన్సిపాల్, వైద్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫార్మసీ హెడ్ జె.గోవర్ధన్, లెక్చరర్ జి.సాయిరాజేష్, ఇతర విభాగాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాజిటివ్‌గా జీవించాలి

మహారాణిపేట: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం ప్రాధాన్యత వివరించి విపత్తుల సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మానసిక ఆరోగ్య సేవల ప్రాముఖ్యతను వివరించారు. పాజిటివ్ మానసిక ఆలోచనలతో జీవనం గడపాలని, మానసిక రుగ్మతల విషయంలో ధైర్యంగా ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్య వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హారిక, మానసిక నిపుణురాలు డాక్టర్ నిత్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి అమానుషం

మురళీనగర్: భారత అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేయడం అమానుషమని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజు అన్నారు. సీజేఐపై దాడిని ఖండిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం బిర్లా జంక్షన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి ఉన్మాద అజెండాయే కారణమని, దీనికి ప్రధాని మోదీ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇది భారత రాజ్యాంగంపై దాడిగా పేర్కొన్నారు. దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉన్మాదాన్ని ప్రేరేపించే ఎజెండాతో ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలని డిమాండ్ చేశారు. పెచ్చరిల్లుతున్న మతోన్మాదాన్ని ఐక్యంగా పోరాడి అడ్డుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ససపల శ్రావణ్, నాయకులు అనిల్, శరత్, అప్పలరాజు, సంతోష్, సాధూరావు, స్వామి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.


బిర్లా జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు

బాలికల సంరక్షణ అందరి బాధ్యత

కంచరపాలెం: నేటి సమాజంలో బాలికలను సంరక్షించుకునే బాధ్యత అందరిపై ఉందని ఆర్పీపేట ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎం.రాజ్యలక్ష్మి అన్నారు. జీవీఎంసీ 56వ వార్డు పరిధి రామూర్తిపంతులపేట ఉన్నత పాఠశాలలో శుక్రవారం ' సేవ్ గర్ల్స్ చైల్డ్' పేరిట విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సమాజంలో బాలికలపై జరుగుతున్న అరాచకాలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థినులు మంచి నడవడికతో మెలగాలని సూచించారు. అపరిచితుల నుంచి బహుమతులకు ఆశపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హెచ్ఎం రాజ్యలక్ష్మి హితవు పలికారు. చిత్రలేఖన పోటీల్లో ప్రథమ బహుమతి కె. మోనీషా, ద్వితీయ బహుమతి టి. పూజిత, తృతీయ బహుమతికి ఎస్.రాజేష్ ఎంపికయ్యారు. కన్సొలేషన్ బహుమతులకు సీహెచ్ జస్మిత, టి.సాయిమోహిత్, ఎం.తులసీనాయుడును ప్రోత్సాహక బహుమతులకు ఎంపిక చేశారు. సోమవారం విజేతలకు ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ ఎస్.జె.వి.ఎస్ శంకర్, క్రాఫ్ట్ టీచర్ సూరిశెట్టి రేణుకాదేవి, కంప్యూటర్ టీచర్ సీహెచ్ నాగపల్లవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విజేతలతో హెచ్ఎం రాజ్యలక్ష్మి

స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో మూడు నెలలు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18 ఏళ్ల నుండి 40 ఏళ్ల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. మధ్యాహ్నం భోజనంతో పాటు శిక్షణ సమయంలో అవసరమైన స్టేషనరీకి కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. వివరాలకు 83090 03957 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సమాచార శాఖ నూతన డైరెక్టర్‌కు శుభాకాంక్షలు

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ నూతన డైరెక్టర్‌గా నియమితులైన ప్రస్తుత వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌ను ఆ శాఖ విశాఖ జిల్లా అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం వీఎంఆర్డీఏ భవనంలోని చాంబర్‌లో జాయింట్ డైరెక్టర్ వి.మణిరామ్, డిప్యూటీ డైరెక్టర్ కె.సదారావు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో వివిధ హోదాల్లో సేవలందించి తమ శాఖ హెచ్‌వోడీగా వస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించారు. అందరూ మరింత ఉత్సాహంతో పని చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కె.ఎస్.విశ్వనాథన్‌ను సమాచార పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో డివిజనల్ పీఆర్‌వో నారాయణరావు, ఏపీఆర్‌వో శ్రీనివాసరావు, ఏవీ సూపర్ వైజర్ వెంకటరావు తదితరులు ఉన్నారు.


సమాచార శాఖ నూతన డైరెక్టర్ విశ్వనాథన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు

పరస్పర సహకారంతో రైల్వే ప్రాజెక్టుల వేగవంతం


సివిల్ ఇంజినీర్లు, కాంట్రాక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: స్పెషల్ క్యాంపెయిన్-5లో భాగంగా శుక్రవారం దొండపర్తి డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డీఆర్ఎం లలిత్ బోహ్రా నేతృత్వంలో అమృత్ సంవాద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజినీరింగ్ వినియోగదారులు, ఇంజినీర్లు, కాంట్రాక్టర్లతో డీఆర్ఎం మాట్లాడారు. పరస్పర సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. ప్రస్తుతం డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, అమృత్ భారత్ స్టేషన్ పనుల గురించి చర్చించారు. అత్యున్నత నాణ్యత, ఉన్నత ప్రమాణాలను అనుసరించి ప్రాజెక్టులను పూర్తిచేయాలని సూచించారు. ఈ నెల 31 వరకు జరిగే ప్రత్యేక క్యాంపెయిన్‌లో భాగంగా రైల్వే అధికారులు స్వయంగా ప్రయాణికులు, వివిధ వర్గాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కో ఆర్డినేషన) ఎ.కె.మహారాణా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 20 దరఖాస్తులు

మర్రిపాలెం: ఐసీడీఎస్ అర్బన్ పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు, ఆయాల నియామకానికి ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. నగరంలో 2 కార్యకర్తల పోస్టులు, 21 ఆయాల పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించారు. రెండు కార్యకర్తల పోస్టులకు సంబంధించి శుక్రవారం సాయంత్రంతో గడువు ముగిసింది. కార్యకర్తల పోస్టులకు మొత్తం 20 దరఖాస్తులు వచ్చినట్టు అర్బన్ సీడీపీవో నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం తాటిచెట్లపాలెం నుంచి 13, మద్దిలపాలెం నుంచి 7 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. తదుపరి ప్రక్రియ ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న వారికి నేరుగా ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామన్నారు.

పీహెచ్‌సీల్లో అదనపు సిబ్బంది నియామకానికి వినతి

మహారాణిపేట: రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు సిబ్బంది, నర్సులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ నర్సింగ్ అసోసియేషన్ నాయకులు ఉషారాణి, సంతమ్మ, జైతు రవీంద్రనాథ్, మంజులాదేవి కోరారు. శుక్రవారం అమరావతిలో ప్రభుత్వ నర్సుల అసోసియేషన్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులతో మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను కలిశారు. స్టాఫ్ నర్స్ అనే నామకరణాన్ని నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చాలని, నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, 55 ఏళ్ల దాటిన నర్సులను కొండ, గిరిజన ప్రాంతాలకు బదిలీ చేయకుండా మినహాయింపు ఇవ్వాలని కోరగా.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు నాయకులు తెలిపారు.

నర్సుల సమస్యలు, సంక్షేమంపై భేటీ


ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణను సత్కరిస్తున్న నర్సెస్ వింగ్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న నర్సుల సమస్యలు, సంక్షేమంపై ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్‌తో ఏపీ గవర్నమెంట్ నర్సెస్ వింగ్ ప్రతినిధులు జైతు రవీంద్రనాథ్, వి.ఉషారాణి, జి.శాంతమ్మ, వింగ్ చైర్‌పర్సన్ మంజులాదేవి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు సిబ్బంది, సహాయక సిబ్బంది నియామకం, స్టాఫ్ నర్స్ అనే పదవి నామకరణాన్ని నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చడం, నర్సుల సంక్షేమం కోసం నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు, 55 ఏళ్ల పైబడిన నర్సులను కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు బదిలీ చేయకుండా మినహాయింపు తదితర అంశాలపై రాష్ట్ర అధ్యక్షుడితో చర్చించారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు నర్సెస్ వింగ్ ప్రతినిధులు తెలిపారు.

గార్డెన్ కార్మికుల తొలగింపు అన్యాయం


కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గార్డెన్ కార్మికులు

సీతంపేట: వీఎంఆర్‌డీఏ పార్కుల్లో అక్రమంగా తొలగించిన గార్డెన్ కార్మికులను తక్షణమే విధుల్లో తీసుకోవాలని వీఎంఆర్‌డీఏ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు డిమాండ్ చేశారు. సెంట్రల్ పార్క్, కైలాసగిరి, వీఎంఆర్‌డీఏ పార్క్, తెన్నేటి పార్కుల్లో పనిచేస్తున్న 18 మంది తోటమాలీలను డీఎఫ్‌వో అధికారి అన్యాయంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ అక్కయ్యపాలెం కార్మిక శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక కేంద్రాలుగా ఉన్న వీఎంఆర్‌డీఏ పార్కుల్లోని ఏడు సొసైటీల్లో 250 మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరికి కార్మిక చట్టాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. 35 ఏళ్లుగా పనిచేస్తున్న 18 మంది గార్డెన్ కార్మికులను ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడాన్ని తప్పుబట్టారు. కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్, రిట్రెచ్‌మెంట్, గ్రాడ్యుటీలు అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గార్డెన్ కార్మికులు సిహెచ్.దుర్గ అప్పారావు, సింహాద్రి, రాంబాబు, శ్రీను, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నియంత్రణ


నరసింహనగర్‌లో దోమల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న కోట్ని శ్రీనివాసరావు

సీతంపేట: వారానికి ఒక రోజు డ్రైడే పాటిస్తే దోమల పెరుగుదలను నియంత్రించవచ్చని మలేరియా హెల్త్ అసిస్టెంట్ కోట్ని శ్రీనివాసరావు అన్నారు. 26, 43 వార్డుల పరిధిలోని అక్కయ్యపాలెం, నరసింహనగర్, నరేంద్రనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే అమలు తీరును ఆయన పరిశీలించారు. ఏఎన్ఎం, ఆశా, యాంటీ లార్వా ఆపరేషన్స్ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి కుండీలు, డ్రమ్ముల్లో లార్వాలు పెరుగుతున్నట్టు గుర్తించి, ఆ నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వారం రోజులు దాటి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలుగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశముందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని, వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకుల్లో నీటిని తొలగించి ఆరబెట్టి మళ్లీ పట్టుకోవాలని సూచించారు. జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు.

పీఎం ఆవాస్ యోజన 2.0పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న జోనల్ కమిషనర్ రాము

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు పరిధి రాజీవ్‌నగర్‌లో టిడ్కో హౌసింగ్ కాలనీలో వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, మార్కెటింగ్ డైరెక్టర్ పి.జీవా ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 35 మంది రక్తదానం చేశారు. అనంతరం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన-అర్బన్ 2.0 పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జెడ్సీ రాము మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు కేంద్రం రూ.1.50 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కలిపి రూ.2.50 లక్షలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు పీఎం సూర్య ఘర్‌తో పాటు కేంద్రం అమలు చేసే ఇతర పథకాలు అందుతాయదన్నారు. కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యవేణి, ఈఈలు సూరిబాబు, డి.నరసింహమూర్తి, డీఈఈ రాజేష్, ఏఈ సుధాకర్, స్థానిక నాయకులు నాయుడు, ఆశీర్వాదం, రవి పాల్గొన్నారు.

13 నుంచి ఐద్వా మహాసభలు

మల్కాపురం: ఈ నెల 13,14,15వ తేదీల్లో అనంతపురంలో జరగనున్న అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 16వ మహాసభల్లో మహిళలు పాల్గొని విజయవంత చేయాలని ఐద్వా రాష్ట్ర కమిటీ ప్రతినిధి ఆర్.విమల పిలుపునిచ్చారు.ఐద్వా మహాసభల సందర్భంగా 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో శుక్రవారం ఆమె ఐద్వా పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ ఐద్వా మహిళ రక్షణకు కవచంలా పని చేస్తుందన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు,హత్యలపై పోరాటాలు చేసి బాధితులకు అండగా నిలిచి దుండగులకు శిక్ష పడే విధంగా పోరాటాలు చేస్తుందని చెప్పారు.ఈ నెల 13,14,15 తేదీల్లో జరగనున్న మహాసభల్లో అంతా పాల్గొని ఐద్వా శక్తి చాటి చెప్పాలన్నారు.